ఘనంగా వినాయక నిమజ్జనం

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో వినాయక శోభాయాత్రలో మహిళల కోలాటం

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 18 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో వినాయక నిమజ్జనోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళల కోలాటాలు, యువకుల నృత్యాల నడుమ శోభాయాత్ర సాగింది. బాలేశ్వర స్వామి ఆలయం వద్ద పెద్దవాగు సమీపంలో మున్సిపల్ చైర్మన్ బుజంగ రావు ఆధ్వర్యంలో వీధి దీపాలు ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

దండేపల్లిలో..

దండేపల్లి, సెప్టెంబర్ 18 : దండేపల్లి మండల కేంద్రంలో ఏకదంతుడిని నిమజ్జనానికి తరలించారు. మహిళల కోలాటాలు, చిన్నారుల నృత్యాల నడుమ శోభాయాత్ర నిర్వహించారు. గోదావరిలో నిమజ్జనం చేశారు.

దండేపల్లి : శోభాయాత్రలో భక్తుల కోలాటం

ఇంటి నంబర్ల తొలగింపు

చెన్నూర్, సెప్టెంబర్ 18 : చెన్నూర్ పట్టణ శివారు సర్వే నంబర్ 840లోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఇండ్లకు గతంలో కేటాయించిన ఇంటి నంబర్లను మున్సిపాలిటీ అధికారులు బుధవారం తొలగించారు. చెన్నూర్ పట్టణంలో అమృత పథకం ద్వారా రూ.31 కోట్లు మంజూరవగా, వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ఈ సర్వే నంబర్‌లోనే అధికారులు స్థలాన్ని కేటాయించారు. ఇంటి నిర్మాణాల విషయం వాటర్ ట్యాంక్ శంఖుస్థాపనకు వచ్చిన కలెక్టర్ కుమార్ దీపక్ దృష్టికి వచ్చింది. దీంతో నిర్మాణాల గురించి విచారణ కోసం మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. అప్పటికే నిర్మాణాలకు మున్సిపాలిటీ నుంచి ఇంటి నంబర్లు జారీ కావడం వివాదాస్పదమైంది. దీంతో కొద్ది రోజుల క్రితం మున్సిపాలిటీ అధికారులు ఇంటి నిర్మాణాల చేపట్టిన 34 మంది యజమానులకు నోటీసులు జారీ చేశారు. అనంతరం బుధవారం మున్సిపాలిటీ అన్‌లైన్ రికార్డుల్లో ఉన్న ఈ ఇంటి నంబర్లను తొలగించారు. ఈ విషయం తెలియటంతో ఇండ్లు నిర్మించుకున్నవారు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై మున్సిపాలిటీ కమిషనర్ గంగాధర్‌ను సంప్రదించగా అందుబాటులో లేరు.

ధాన్యం సేకరణపై ప్రణాళికలు రూపొందించాలి

వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ దాసరి వేణు, జిల్లా అధికారులు

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ హాన్

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 18 : వానకాలం ధాన్యం సేకరణపై కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ హాన్ పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి బుధవారం ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాలు, సహకార, మార్కెటింగ్ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం సేకరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు నిర్వహించాలని తెలిపారు. కలెక్టరేట్‌లో వీసీలో అదనపు కలెక్టర్ దాసరి వేణు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌తో కలిసి హాజరయ్యారు. దాసరి వేణు మాట్లాడుతూ.. జిల్లాలోని రైస్ మిల్లులను గుర్తించి, కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులను అవసరం మేరకు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో సహకార శాఖ అధికారి రబ్బాని, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసు నిందితుల అరెస్ట్

నిందితుల అరెస్టు చూపుతున్న ఏసీపీ ప్రకాశ్

లక్షెట్టిపేట,సెప్టెంబర్ 18: లక్షెట్టిపేట మండలం లక్ష్మీపూర్‌కు చెందిన పందిరి లింగయ్య, గుమ్ముల సంతోష్‌ను కిడ్నాప్ చేసిన నిందితులను లక్షెట్టిపేట పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్‌లో మంచిర్యాల ఏసీపీ ప్రెస్‌మీట్ వెల్లడించారు. ఈ నెల 14న లక్ష్మీపూర్‌లో మత్స్య సహకార సంఘం ఎన్నికలు ఉండడంతో పోటీలో శాఖపురం శంకరయ్య, అరుగుల నర్సయ్య ఉన్నారు. శంకరయ్యకు మద్దతుగా 15 మంది, నర్సయ్యకు మద్దతుగా 16 మంది ఉన్నారు. దీంతో ఓడిపోతానేనే భయంతో నర్సయ్యకు మద్దతుగా ఉన్న పందిరి లింగయ్య, గుమ్ముల సంతోష్‌ను ఎన్నికలకు హాజరు కాకుండా ఒక రోజు ముందే మహ్మద్ మోహిన్, సుందిల్ల దేవేందర్, జంగ ఎల్లయ్య, మెట్టుపల్లి రవి, తాళ్ల తరుణ్‌తో కలిసి శంకరయ్య కిడ్నాప్ చేయించాడు. కిడ్నాప్ చేసినందుకు లక్ష రూపాయల సుపారీ ఒప్పుకుని రూ.50వేలు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. కిడ్నాప్‌కు గురైన లింగయ్య భార్య సరోజ పోలీసులకు ఫిర్యాదు చేసింది. లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్, ఎస్ఐ సతీశ్ ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి నిందితులను లక్షెట్టిపేటలోని కరీంనగర్ చౌరస్తాలో పట్టుకున్నట్లు ఏసీపీ వెల్లడించారు. నిందితులు కిడ్నాప్‌కు ఉపయోగించిన రెండు కార్లతో పాటు రూ.4వేలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసును ఛేదించిన సీఐ, ఎస్ఐలతో పాటు పీసీలు మురళి, అంజిబాబు, తిరుపతి, సునీలను ఏసీపీ అభినందించారు.

ప్రధాన పార్టీ యువ నాయకుడిపై దాడి !

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 18: మంచిర్యాలలో ఓ ప్రధాన పార్టీ యువనాయకుడిపై దాడి జరిగిన విషయం బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో గల 'మా విందు' హోటల్ పక్కన ఉన్న గల్లీలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఓ ప్రధాన పార్టీకి చెందిన యువ నాయకుడితో పాటు వెంట ఉన్న మరో యువకుడిపై దాడి చేసినట్లు ఆ పార్టీ వర్గాల్లో చర్చించుకోవడంతో ఈ సంఘటన కాస్త వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై మంచిర్యాల పట్టణ సీఐ బన్సీలాల్‌ను ఫోన్లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

ఇసుక కుప్పలు సీజ్

రెబ్బెన, సెప్టెంబర్ 18 :రెబ్బెన మండలంలో పలు చోట్ల అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక కుప్పలను సీజ్ చేసినట్లు ఏడీ గంగాధర్ తెలిపారు. దేవులగూడ సమీపంలో 80 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక, గోలేటి ఎక్స్‌రోడ్‌లోని పాత సిరామిక్స్ కంపెనీలో 15 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక అక్రమంగా నిల్వ ఉంచారన్న సమాచారం మేరకు తనిఖీ చేసి, సీజ్ చేసినట్లు తెలిపారు. రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్‌రెడ్డి, ఆర్ఐ ప్రేంకిరణ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

జైపూర్, సెప్టెంబర్ 18 : జైపూర్ మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద బుధవారం డీఆర్డీవో కిషన్, అంబుడ్స్‌మెన్ దుర్గం శివరాంల ఆధ్వర్యంలో ఉపాధి హామీ 14వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2023-24కు సంబంధించి 20 జీపీల్లో రూ.2,71,16,216 పనులు జరుగగా, గ్రామాల వారీగా తనిఖీ బృందాల నివేదికను వివరించారు. పలు అవకతవకలు జరిగినట్లు వెల్లడించారు. కొన్ని గ్రామాల్లో పంచాయతీల తీర్మానం లేకుండానే ఫీల్డ్ అసిస్టెంట్ల నిర్ణయాల మేరకు పనులు చేసినట్లు తెలిపారు. మరికొన్ని గ్రామాల్లో కూలీలు పనులకు రాకుండానే మస్టర్లు వేసినట్లు తేలిందన్నారు. తనిఖీ నివేదికను విన్న అధికారులు, విచారణ అనంతరం ఇందులో రూ.41,632 రికవరీ, పెనాల్టీల కింద సిబ్బంది నుంచి వసూలు చేయాలని అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది తప్పులకు అవకాశం లేకుండా పనిచేయాలని డీఆర్డీవో సూచించారు. సమావేశంలో ఎస్ఆర్పీ ప్రదీప్‌కుమార్, ఎస్‌టీఎం వేణు, ఎంపీడీవో సత్యనారాయణ, ఆర్‌డబ్లూఎస్ డీఈ విద్యాసాగర్, ఎంపీవో శ్రీపతిరావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 18 : న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు లక్షెట్టిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కారుకూరి సురేందర్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు, రిటైర్డ్ జడ్జి రాజన్న, న్యాయవాదులు నరేందుల సురేందర్, రవీందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన గణేశ్ శోభాయాత్ర

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 18 : మంచిర్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన శోభాయాత్ర విజయవంతంగా ముగిసిందని హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు దీపేశ్ రేన్వా అన్నారు. పట్టణంలోని ఖండేల్వాల్ భవన్‌లో బుధవారం మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సుమారు 2,300 వినాయక ప్రతిమల నిమజ్జనం గోదావరిలో మంగళవారం మధ్యాహ్నం ప్రారంభమై, బుధవారం ఉదయం 5 గంటల వరకు కొనసాగిందన్నారు. విజయవంతం కావడానికి సహకరించిన రాజకీయ ప్రముఖులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి, హిందూ బంధువులకు ధన్యవాదాలు తెలిపారు. హిందూ ఉత్సవ సమితి సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన అగ్ని ప్రమాదం

జన్నారం, సెప్టెంబర్ 18 : మండల కేంద్రంలోని స్లేట్స్ హైసూల్ వెనుకాల కాలనీలో గల దాసరి సత్యనారాణ ఇంట్లో అద్దెకు ఉంటున్న లక్ష్మణ్ వంట గద్దిలో సిలిండర్ పైపు ఊడిపోయి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా, ఆ కాలనీలోకి వాహనం వెళ్లే పరిస్థితి లేదు. దీంతో సిబ్బంది ఇంట్లోకి వెళ్లి, మంటలను అదుపుచేసి, సిలిండర్‌ను బయటకు తీశారు. దీంతో ఇంటి యజమాని, కాలనీవాసులు ఊపిరిపీల్చుకున్నారు. ఫైర్ సిబ్బందిని స్థానికులు అభినందించారు. ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్, సిబ్బంది వీరేందర్, భువనచంద్ర, రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

హాజీపూర్, సెప్టెంబర్ 18 : హాజీపూర్ మండలం దొనబండకు చెందిన గుండవేణి బూదమ్మ (60) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ గోపతి సురేశ్ తెలిపారు. రెండేళ్ల నుంచి బూదమ్మ క్యాన్సర్‌తో బాధపడుతున్నది. భరించలేక బుధవారం మధ్యాహ్నం తన ఇంటి ఆవరణలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నది. బూద వ్వకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భర్త కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 18 : నస్పూర్ మున్సిపాలిటీలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ రామ్మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల లోని 132 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్యం మత్తులో ఒకరి మృతి

బెల్లంపల్లి, సెప్టెంబర్ 18 : మద్యం మత్తులో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద బుధవారం చోటు చేసుకున్నది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం.. భీమిని మండలం తంగళ్లపల్లికి చెందిన చాపల మల్లేశ్ (35) కూలీ పనులు చేసుకుంటుండేవాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్య మరొకరిని వివాహం చేసుకున్నది. ఈ క్రమంలో మరింతగా మద్యానికి బానిసయ్యాడు. ఇద్దరు కొడుకులు, తన తండ్రిని సైతం పట్టించుకోకుండా జులాయిగా తిరిగేవాడు. మంగళవారం సాయంత్రం బెల్లంపల్లికి వచ్చిన మల్లేశ్ కాంటా ఏరియాలోని ఓ వైన్ షాపులో మద్యం తాగాడు. రాత్రి కావడంతో కాంటా పరిసరాల్లో నిద్రపోయాడు. తాగేందుకు అందుబాటులో నీరు లేక మద్యం మత్తులో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో వెల్లడించారు.

ట్రాక్టర్-ఆటో ఢీ.. ఇద్దరికి గాయాలు

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 18 : కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రధాన రోడ్డు అటవీ శాఖ కార్యాలయ సమీపంలో మంగళవారం రాత్రి ట్రాక్టర్-ఆటో ఢీ కొటుటకున్నాయి. నిమజ్జనానికి పెద్దవాగుకు వెళ్తున్న క్రమంలో రాంగ్ రూట్‌లో వచ్చిన ట్రాక్టర్ ఆటోను ఢీ కొట్టింది. ఆటో డ్రైవర్ ఎస్‌కే జావిద్, మరో వ్యక్తి ఎస్‌కే తాజ్‌కు గాయాలయ్యాయి. బాధితుల బావ నిహాల్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించారు.

నేడు ప్రత్యేక సమావేశం

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 18 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయ సమావేశం మందిరంలో గురువారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు జడ్పీసీఈవో లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు సకాలంలో హాజరవ్వాలని కోరారు.

నూతన కార్యవర్గం

హాజీపూర్, సెప్టెంబర్ 1 : తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖ ఎంప్లాయీస్ యూనిన్-327 నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పీ రమేశ్ (మంచిర్యాల), రీజినల్ ప్రెసిడెంట్‌గా కే సుదర్శన్ (మంచిర్యాల), సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గాదం వెంకటేశ్వర్ (మంచిర్యాల), టీ శ్రీనివాస్, ఎం వికాస్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఈ మధుకర్, ఉపాధ్యక్షులుగా సురేశ్, రాచపల్లి రాజు, రీజినల్ కార్యదర్శిగా రవీందర్, ట్రెజరీగా రామకృష్ణాచార్యులు, మహిళా కార్యదర్శిగా రజిత, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

రాంగ్ రూట్‌లో ఎమ్మెల్యే కాన్వాయ్..

రాంగ్ రూట్‌లో వెళ్తున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే కాన్వాయ్

బెల్లంపల్లి, సెప్టెంబర్ 18 : నిబంధనలు పాటించి నియోజకవర్గ ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన ఎమ్మెల్యేనే రాంగ్ రూట్‌లో తన కాన్వాయ్ రావడం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో చర్చనీయాంశమైంది. బెల్లంపల్లి పట్టణానికి తాగునీటి పథకానికి శుంకు స్థాపన చేసిన అనంతరం డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించేందుకు యూటర్న్ తీసుకొని వెళ్లాల్సి ఉండగా ఎమ్మెల్యే తన కాన్వాయ్‌తో రాంగ్ రూట్‌లో వెళ్లారు. ఆయన బాటలోనే నియోజకవర్గ నాయకులు వాహనాలు కూడా అదే రాంగ్ రూట్‌ను అనుసరించాయి. దీంతో జాతీయ రహదారిపై వాహనదారులు ఇబ్బంది పడ్డారు. జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే కన్నాల ప్రాంతంలో రాంగ్ రూట్‌లో వచ్చి ఇబ్బందులకు గురి చేయడమేమిటని వాహనదారులు మండిపడ్డారు.

మహిళాశక్తి క్యాంటీన్ ప్రారంభం

మంచిర్యాలటౌన్, సెప్టెంబర్ 18 : మంచిర్యాల మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను బుధవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, కమిషనర్ మారుతీ ప్రసాద్ ప్రారంభించారు. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మహిళా సంఘాల సభ్యులకు క్యాంటీన్ల ఏర్పాటుకు అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో ఈ క్యాంటీన్‌ను ఏర్పాటుచేశారు. శ్రీ పంచముఖ హనుమాన్ స్వయం సహాయక సంఘంలో సభ్యురాలైన మదాసు మంగకు నిర్వహణ అనుమతించారు. ఇందుకు ఆమె రూ.లక్ష రుణాన్ని బ్యాంకు నుంచి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా టీఎంసీ చంద్రయ్య, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

దండేపల్లి, సెప్టెంబర్ 18 : దండేపల్లి మండలం లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో హవర్లీ బేసిస్ ప్రాతిపదికన 6 నుంచి 8వ తరగతి వరకు సోషల్, 9 నుంచి ఇంటర్ వరకు గణితం, ఇంగ్లిష్ బోధించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం జయకృష్ణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీసీ గణితం, పీజీటీసీ ఇంగ్లిష్ బోధనకు పీజీలో 50 శాతం మార్కులు, బీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు, సోషల్ పీజీలో 50 శాతం మార్కులతో బీఎడ్, టెట్ పేపర్-2లో అర్హత కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. 20వ తేదీలోగా బయోడేటా ఫారం, సంబంధిత విద్యార్హతల జిరాక్స్ కాపీలతో పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాల తెలిపారు.

మందమర్రి రూరల్, సెప్టెంబర్ 18 : ఆదర్శ(మోడల్) పాఠశాలలో హవర్లీ బేసిస్‌లో ఇంటర్ విద్యార్థులకు సివిక్స్ బోధించేందుకు పీజీటీ పోస్ట్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సారా తస్నీమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ పొలిటికల్ సైన్స్, బీఈడీ చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు 24వ తేదీలోగా బయోడేటా ఫారంతో పాటు, సంబంధిత విద్యార్హత జిరాక్స్ కాపీలతో స్కూల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

జిల్లాస్థాయిలో విద్యార్థుల ప్రతిభ

చెన్నూర్, సెప్టెంబర్ 18 : ఇటీవల జిల్లాస్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో చెన్నూర్ సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికల) పాఠశాల విద్యార్థి రమ్య విజేతగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ ప్రవంతి బుధవారం తెలిపారు. అండర్-18 విభాగం 400మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. రమ్యను ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ సరిత, జూనియర్ ప్రిన్సిపాల్ స్వప్న, పీఈటీ సహీనాసుల్తానా, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు రక్తదానం.. అన్నదానం.. ర్యాలీ

చెన్నూర్ టౌన్, సెప్టెంబర్ 18 : మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా గురువారం చెన్నూర్‌లోని సయ్యద్ షా బాబా దర్గా వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉదయం 9:30 గంటలకు చెన్నూర్‌లోని ఐబీ దర్గా నుంచి ర్యాలీ తీయనున్నట్లు, మధ్యాహ్నం 2 గంటలకు అన్నదానం నిర్వహించనున్నట్లు సభ్యులు పేర్కొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

సిర్పూర్(టీ), సెప్టెంబర్ 18 : చత్తిస్‌గఢ్ రాష్ట్రంలోని కోలార్ నుంచి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న 35 పశువులను పట్టుకొని, ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సిర్పూర్(టీ) ఎస్ఐ కమలాకర్ తెలిపారు. రెండు ఐచర్ వ్యానుల్లో అక్రమంగా పశువులను మండలకేంద్రం మీదుగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు పట్టుకున్నామని చెప్పారు. యజమాని రాంచంద్ర, నవాబ్‌ఖాన్, సలాలుద్దీన్, అల్తాఫ్‌ఖాన్, అదిల్‌పాషా, అదిప్‌పాషాపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పశువులను కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

సిర్పూర్(టీ), సెప్టెంబర్ 18 : మండలంలోని పలు గ్రామాల నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న 4 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఆర్ఐ గోపాల్ తెలిపారు. బోదంపల్లి గ్రామానికి చెందిన నాందేవ్, లోనవెల్లి గ్రామానికి చెందిన పుల్‌జలే తిరుపతి ఆయా గ్రామాల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని బైకులపై వెంకట్రావ్‌పేట్ మీదుగా మహారాష్ట్రకు తరలిస్తుండగా, వెంకట్రావ్‌పేట్ సమీపంలో పట్టుకున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ కమిటీ

జైపూర్, సెప్టెంబర్ 18 : జైపూర్ తహసీల్ కార్యాలయం ఎదుట అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు మాజీ ఎంపీటీసీలు మంథెన లక్ష్మణ్, శీలం వెంకటేశ్ ఆధ్వర్యంలో బుధవారం కమిటీ ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులు ఇరిగిరాల మల్లేశ్, ఇరిగిరాల లింగయ్య, గోనే నర్సయ్య, గోదారి లింగయ్య, పండుగ రాజన్న, వెంకటి, శ్రీనివాస్, శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఇద్దరి రిమాండ్

జన్నారం, సెప్టెంబర్ 18 : జన్నారం రేంజ్ పరిధి జన్నారం బీట్‌లోని 308 కంపార్ట్‌మెంట్‌లో గల చెట్లను తొలగించి, భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించిన రఫీఖాన్, చిన్న య్యను బుధవారం అరెస్ట్ చేసినట్లు డీఆర్వో రవి, బీట్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. లక్షెట్టిపేట కోర్టులో హాజరుపర్చగా, జడ్జి రిమాండ్ విదించినట్లు పేర్కొన్నారు.

బదిలీలు నిలిపివేయాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 18 : ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయుల బదిలీలను వెంటనే నిలిపివేయాలని వివిధ రాజకీయ పార్టీలు, విద్యాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు వినతి పత్రం అందజేశారు. దినకర్, కార్తీక్, చిరంజీవి, ము రళి, సలీం, సతీశ్ బాబు, విశాల్, జయరాజ్, మథార్ హుస్సే న్, జీవన్, ప్రశాంత్, టీకానంద్, వినోద్, భీమేశ్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు తొలగించాలి

దహెగాం, సెప్టెంబర్ 18 : మండలంలోని చిన్నరాస్పల్లి ప్రభుత్వ పాఠశాల ప్రహరీని ఆనుకొని నిర్మించిన అక్రమ కట్టడాలను వారంలోగా తొలగించాలని ఎంపీడీవో రాజేందర్ ఆదేశాలు జారీ చేశారు. పాఠశాల హెచ్ఎం సునితతో పాటు పలువురు గ్రామస్తులు ప్రజాఫిర్యాదుల విభాగంలో కలెక్టర్‌కు పిర్యాదు చేశారని పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు హెచ్ఎం, ఆర్ఐ నాందేవ్, మండల సర్వేయర్ ధన్‌రాజ్‌తో కలిసి బుధవారం కట్టడాలపై స్థానికంగా విచారణ చేపట్టామన్నారు. కట్టడాలు ప్రహరీని ఆనుకొని ఉండడంతో పాటు, ఆర్ఆండ్‌బీ రోడ్డు స్థలంలో ఉన్నాయని, వారంలోగా తొలగించాలని సంబంధిత వ్యక్తులను ఆదేశించామని తెలిపారు. ఈ కట్టడాలపై పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని పేర్కొన్నారు.

గిరి గ్రామాల అభివృద్ధికి కృషి

పెంచికల్ పేట్, సెప్టెంబర్ 18 : అటవీ ప్రాంత మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ దండే విట్టల్ అన్నారు. మండలంలోని కమ్మర్గాం గ్రామాన్ని బుధవారం ఆయన సందర్శించారు. గ్రామానికి రోడ్డు సరిగా లేక బస్సు రావడం లేదని గ్రామస్తులకు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన, గతేడాది సీడీపీ మిగులు నిధులు రూ.10 లక్షలతో నందిగామ నుంచి బెజ్జూర్ వరకు మొరం రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సీనియర్ నాయకుడు బుచ్చిరాంను పరామర్శించారు. బెజ్జూర్ మాజీ జడ్పీటీసీ పుష్పలత, మాజీ సర్పంచ్ మదనయ్య, చంద్రమౌలి, నాయకులు హర్షద్ హుస్సేన్, జగ్గ గౌడ్, సిడాం గణపతి, శ్రీవర్ధన్, రాచకొండ కృష్ణ, రామగోని శంకర్ గౌడ్, ఇలియాస్, సదాశివ్, ఆత్రం బాపు, బాపురావ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

లక్షెట్టిపేట,సెప్టెంబర్ 18: లక్షెట్టిపేట పట్టణంలోని ఐబీ వద్ద బుధవారం అనుమానాస్పదంగా ఒంటరిగా తిరుగుతున్న బాలుడిని లక్షెట్టిపేట పోలీసులు గురితంచి, తల్లిదండ్రులకు అప్పగించారు. చందారం గ్రామం ఆంధ్రబోర్ ప్రాంతానికి చెందిన వేముల నవీన్ కుమార్ తన కొడుకకును ఈ నెల 17న పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చేర్పించారు. మరుసటిరోజు ఉదయం పాఠశాలలో దింపి, వెళ్లాడు. బాబు బైక్ వెనకాలే నడుచుకుంటూ ఐబీ ప్రాంతానికి చేరుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు బ్లూకోర్టు పోలీసులు బాబును స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి, జరిగిన విషయం సోషల్ మీడియాలో పెట్టారు. గమనించిన కుటుంబ సభ్యులు స్టేషన్‌కు రావడంతో ఎస్ఐ సతీశ్ సిబ్బందితో కలిసి బాబును క్షేమంగా వారికి అప్పగించారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

బెల్లంపల్లి, సెప్టెంబర్ 18 : గురుకుల పాఠశాలల పని వేళలను శాస్త్రీయంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ గుర